క్లుప్తంగా

ఎంపీడీఓగా హరిప్రసాద్ రెడ్డి



తవణంపల్లె: మండలానికి నూతన ఎంపీడీఓగా టి.హరిప్రసాద్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అన్నమయ్య జిల్లా పెనగలూరు నుంచి బదిలీపై తవణంపల్లెకు వచ్చారు. తవణంపల్లె ఇన్‌చార్జి ఎంపీడీఓ, ఈఓపీఆర్‌డీ రాఘవేంద్రరాజు నుంచి రికార్డులు తీసుకొని పదవీ బాధ్యతలు చేపట్టారు. హరిప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ మండల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామన్నారు. ఆయనతోపాటు ఈఓపీఆర్‌డీ రాఘవేంద్రరాజు, ఏఓ రెడ్డిబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

అందరికీ పనులు కల్పించాలి



నీటితొట్టెలను పరిశీలిస్తున్న ఏపీడీ సుబ్రమణ్యం

గుడిపాల: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ప్రతి ఒక్క కూలీకి పనులు కల్పించాలని ఉపాధి హామీ ఏపీడీ సుబ్రమణ్యం తెలిపారు. ఉపాధి హామీ కార్యాలయంలో సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీలో 100 మందికి తక్కువ కాకుండా కూలీలకు తప్పనిసరిగా పనులు కల్పించాలని సూచించారు. గ్రామాల్లో సోక్‌పిట్స్, కంపోస్ట్‌పిట్స్, పశువుల నీటి తొట్టెలు, షెడ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఆదిలక్ష్మాంబపురంలో ఏర్పాటు చేసిన పశవుల నీటి తొట్టెలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాసులు, జూనియర్ ఇంజినీర్ సునంద, టెక్నికల్ అసిస్టెంట్లు మునిరత్నం, సుందరయ్య, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేడు హనుమజ్జయంతి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం పొన్నియమ్మగుడివీధిలోని శ్రీవీరాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం హనుమజ్జయంతిని నిర్వహించారు. ఉదయం ధ్వజారోహణం, సాయంత్రం కల్యాణోత్సవం ఉంటుందన్నారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏకదిన లక్షార్చన నిర్వహించనున్నట్లు అర్చకులు పేర్కొన్నారు.

నేడు, రేపు పలుచోట్ల గంగజాతర

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని దొడ్డిపల్లి, మురుగానంపల్లి, ఇరువారం తదితర ప్రాంతాల్లో మంగళవారం గంగ జాతర ప్రారంభం కానుంది. ఉదయం అమ్మవారికి అంబలి, విశేష పూజలు, రాత్రి కుంభ నైవేద్యం సమర్పణ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. బుధవారం అమ్మవారి నిమజ్జనం ఉంటుందని నిర్వాహకులు పేర్కొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

తవణంపల్లె: గ్రామాల్లో పరిశుభ్రతతోనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని వైద్యాధికారి డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. మండలంలోని ఎగువ వెంకటాపురంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మోహన్‌వేలు 30 మందికి పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు.

సీహెచ్‌ఓల ర్యాలీ



ర్యాలీ చేస్తున్న సీహెచ్‌ఓలు

చిత్తూరు రూరల్(కాణిపాకం): సీహెచ్‌ఓల న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని సీహెచ్‌ఓ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. నిరవధిక సమ్మెలో భాగంగా సీహెచ్ ఓలు చిత్తూరు నగరం గాంధీ విగ్రహం కూడలిలో సోమవారం ర్యాలీ చేశారు. అనంతరం మానవహారం నిర్వహించి గాంధీ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చారు. జిల్లా అధ్యక్షులు కల్పన మాట్లాడుతూ ఆరేళ్లు పూర్తయిన సీహెచ్‌ఓలను క్రమబద్ధీకరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కీర్తిప్రియ, భాను ప్రియ, రషీద్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



డీఎంఏ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

చిత్తూరు అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా మునిసిపాలిటీలు, కార్పొరేషన్లలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం చొరవ చూపాలని ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షులు మధుబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి రామ్మూర్తి కోరారు. ఆయన సోమవారం విజయవాడలో మునిసిపల్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ కార్యదర్శి కన్నబాబు, డీఎంఏ సంపత్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందచేశారు. చిత్తూరు, గుంటూరు, పుత్తూరు మునిసిపాలిటీలకు చెందిన యూనియన్ నాయకులంతా అధికారులను కలిసి సమస్యలు వివరించారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన యూనియన్ నాయకులు గణేష్‌కుమార్, సుమన్ పాల్గొన్నారు.

మొరవపోతున్న గౌని చెరువు



మొగిలిలో నిండిన గౌనిచెరువు



మొరవపోతున్న చెరువు



గౌరీశంకరపురం చెరువుకు చేరుతున్న మొరవ నీరు

బంగారుపాళెం: మండలంలోని మొగిలి సమీపంలోని గౌనిచెరువు సోమవారం మొరవపోతోంది. దీంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత నాలుగు రోజులుగా మండలంలో వర్షాలు కురుస్తున్నాయి. మొగిలి గౌండిన్య అటవీ పరివాహక ప్రాంతంలోనూ జోరుగా వర్షాలు కురవడంతో వర్షపు నీరు గౌనిచెరువుకు చేరింది. చెరువు నిండి మొరవ సాగడంతో గౌరీశంకరపురంలోని గౌరీతటాకానికి నీరు చేరుతుండడంతో పంచాయతీ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గౌనిచెరువు పరిసర గ్రామాల్లో భూగర్భజలాలు అభివృద్ధి చెంది బోరు బావుల్లో నీటిమట్టం పెరిగేందుకు అవకాశం ఉందన్నారు. పంటల సాగుకు నీరు సమృద్ధిగా అందుబాటులోకి వస్తుందని అంటున్నారు. గౌనిచెరువు మొరవపోవడం ద్వారా వచ్చే వర్షాకాలంలో బలిజపల్లె, పాలమాకులపల్లె, ఊటువంక చెరువులకు నీరు చేరే అవకాశం ఉందని అంటున్నారు.

రెవెన్యూలో ముడుపుల జబ్బు

- చిత్తూరు నగర పరిధిలోని కనికాపురానికి చెందిన ఓ వ్యక్తి తండ్రి ఏడాది క్రితం చనిపోయాడు. గత కొన్ని నెలలుగా పట్టాపాసుపుస్తకం ఇతని అమ్మ పేరుతో మార్చుకోవాలని తిరుగుతున్నాడు. కార్యాలయంలో అసలు ఎవరూ పట్టించుకోవడం లేదు. వారం కిందట ఎన్నిసార్లు తిరగాలని వీఆర్వోను అడిగితే, ఇంకో పది సార్లు తిరుగు అంటూ బదులిచ్చారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆ వ్యక్తి మరో నాలుగు రోజులు చూసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నాడు.

- చిత్తూరు మండలం తాళంబేడు గ్రామంలోని కొంతమంది భూ సర్వేకు చలానా కట్టారు. నెలలు గడుస్తున్నా ఆ భూములు సర్వేకు నోచుకోవడం లేదు. ఆన్‌లైన్ ఫీజులు చెల్లింపుతో పాటు అదనంగా డబ్బులిచ్చుకున్నప్పటికీ సర్వే పూర్తి కాలేదు. కాళ్లరిగేలా తిరుగుతున్న గ్రామస్తులను ఆ సర్వేయర్ పట్టించుకోవడం లేదని అధికారులకు ఫిర్యాదు చేశారు. ఫోన్‌పే ద్వారా డబ్బులు పంపిన విషయాన్ని రైతులు బయటపెట్టారు.



రూరల్ తహసీల్దార్ కార్యాలయం

- ● మ్యుటేషన్ కోసం ముప్పు తిప్పలు పెడుతున్న సిబ్బంది
- ● సర్వే.. సర్వం కానులమయం
- ● వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): రెవెన్యూ శాఖలో అవినీతి జలగలు ప్రజల్ని పీడిస్తున్నాయి. ప్రతి పనికీ ధర నిర్ణయించి మరీ వసూళ్లకు పాల్పడుతున్నారు. భూములు, స్థలాల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నా, సర్వే, మ్యుటేషన్లు, భూ మార్పిడి చేయాలన్నా, ధ్రువీకరణ పత్రాల జారీకి ముడుపులు చెల్లించనిదే పనులు జరగడం లేదు. ఎందుకు డబ్బులు ఇవ్వాలని ప్రశ్నిస్తే నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిప్పించుకుంటున్నారు. కొందరు అధికారులు నేరుగా నగదు తీసుకోకుండా ఫోన్ పే, పేటీఎం, గూగుల్ పే ద్వారా వసూళ్లకు పాల్పడుతున్నారు.

చిత్తూరు రూరల్ తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటు చేసి 8 నెలలు గడుస్తోంది. పరిపాలన సౌలభ్యం కోసం ఈ కార్యాలయాన్ని అర్బన్ నుంచి విభజించారు. అయితే పరిపాలన సౌలభ్యాన్ని రెవెన్యూ అధికారులు అటకెక్కించారు. రైతులు, ప్రజలను తిప్పించుకోవడమే పనిగా పెట్టుకున్నారు. ప్రధానంగా మ్యుటేషన్, అనుభవ పత్రం, సర్వే, వాల్టా సర్టిఫికెట్, చిన్న, సన్నకారు రైతు సర్టిఫికెట్ల జారీలో రైతులను ఛీకొడుతున్నారు. పదే పదే తిప్పించుకుని ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ముడుపులిస్తే తప్ప పనులు జరగడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. కార్యాలయానికి రోజువారీగా 50 నుంచి 80మంది వరకు వస్తున్నారు. ఇక్కడ పనులు కాకపోవడంతో కూతవేటు దూరంలో ఉన్న కలెక్టరేట్‌ను ఆశ్రయిస్తున్నారు.

పనులకు రేట్లు ఫిక్స్

మ్యుటేషన్ అనేది రెవెన్యూలో ఇప్పుడు పెద్ద వ్యాపారంలా మారింది. కొందరు ఇదే అదునుగా భావించి బాధిత భూ యజమానులను కొందరు ముక్కుపిండి వసూళ్లు చేస్తున్నారు. ఒక రైతు నుంచి రూ.ఒక లక్ష వరకు వసూలు చేశారనే ఆరోపణలు వచ్చాయి. ఇలా మ్యుటేషన్‌కు రూ. 20వేల నుంచి రూ.ఒక లక్ష వరకు డిమాండ్ చేస్తున్నారన్న చర్చ జరుగుతోంది. సర్వేకు రూ.5 వేల నుంచి రూ.ఒక లక్ష వరకు. వాల్టా పత్రానికి రూ.20వేలు, చిన్న, సన్నకారు రైతు పత్రానికి రూ.2వేలు, ఆదాయ, కుల ధృవీకరణ పత్రాలకు రూ.500 నుంచి రూ.1000 వసూలు చేస్తున్నారని పలువురు బహిరంగంగా చెబుతున్నారు.

ఆన్‌లైన్‌లో కొట్టు

భూములు ఆన్‌లైన్, భూ మార్పిడికి ఫోన్ పే, గూగుల్ పే ద్వారా వసూళ్లు చేస్తున్నారు. తమకు తెలిసిన వారి ఫోన్ నంబరు ఇచ్చి దానికి నగదు పంపించాలని చెబుతున్నారు. ఇచ్చిన ఫోన్ నంబరు ఖాతాలో నగదు జమకాగానే పత్రాలపై సంతకాలు చేసి పంపుతున్నారు. గ్రామ సచివాలయాల్లో సర్వేయర్లు నగదు డిమాండ్ చేస్తున్నారు. సిబ్బంది ద్వారా ప్రతి నెలా లక్ష్యం నిర్దేశించి కార్యాలయానికి సేవలు నిమిత్తం వచ్చే వారి నుంచి వసూలు చేయిస్తున్నారు.

ఫిర్యాదు ఇస్తే చర్యలు

ఓ సర్వేయర్ డబ్బులు వసూలు చేశాడని తెలిసి నోటీసులు ఇవ్వనున్నాం. కచ్చితంగా చర్యలు ఉంటాయి. ప్రజలకు ఏవైనా ఇబ్బందులుంటే నేరుగా వచ్చి ఫిర్యాదు చేయవచ్చు. మీ సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తాం. ఎవరు ఇబ్బంది పడాల్సిన అవసరం లేదు. ఎవరు డబ్బులు తీసుకుంటున్నారో.. చెబితే వారిపై చర్యలు తీసుకుంటాం.

–లోకేశ్వరి, తహసీల్దార్, చిత్తూరు రూరల్

సెలవులో మునిసిపల్ కమిషనర్

చిత్తూరు అర్బన్: చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ ఈ నెల 26వ తేదీ వరకు సెలవు పెట్టారు. గత వారం ఆయన ప్రయాణిస్తున్న కారు రోడ్డు ప్రమాదానికి గురవడం, కమిషనర్‌తో పాటు అందులో ఉన్న ముగ్గురు చిన్నపాటి గాయాలతో బయటపడ్డారు. దీంతో ఆరోగ్యం కుదుటపడేందుకు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు చెప్పడంతో, కమిషనర్ సెలవు పెట్టారు. అప్పటివరకు కార్పొరేషన్ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా మునిసిపల్ ఇంజనీరు వెంకటరామిరెడ్డి వ్యవహరించనున్నారు.

గంగ జాతరకు చాటింపు



తొలి గుంజకు పూజలు చేస్తున్న మహిళలు

ఐరాల: మండల కేంద్రంలో వెలసిన శ్రీ పాలేటమ్మ ఆలయంలో సోమవారం గంగ జాతర చాటింపు వేశారు. ఉదయం తొలి గుంజకు పసుపు, కుంకుమ పూసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి భక్తులు 101 బిందెలతో పసుపు నీళ్లు పోసి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహించనున్న జాతరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

లింగ నిర్ధారణ నిర్వాహకులను శిక్షించాలి



మాట్లాడుతున్న మహిళా నాయకులు షకీలా

చిత్తూరు కార్పొరేషన్: లింగ నిర్ధారణ చేస్తున్న వారిని శిక్షించాలని యూటీఎఫ్, సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సీఐటీయూ కార్యాలయంలో మహిళ సంఘం, యూటీఎఫ్, సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. నాయకులు షకీలా, రమణ, గంగరాజులు మాట్లాడుతూ జిల్లాలో ధనార్జనే ధ్యేయంగా నడుస్తున్న స్కానింగ్ సెంటర్లు ఇష్టారాజ్యంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారన్నారు. ప్రధానంగా చిత్తూరులో ప్రైవేటు ఆస్పత్రులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో సౌకర్యాలు లేకపోవడంతో ఎక్కువగా రోగులు ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తున్నట్లు చెప్పారు. జిల్లా వైద్యాధికారులు పర్యవేక్షణ చేసి స్కానింగ్ సెంటర్లపై, డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు మెడికల్ షాపులపై తనిఖీ చేయాలని డిమాండ్ చేశారు.

మామిడిలో పండుఈగ నివారణ బుట్టలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మామిడి పంటపై ప్రస్తుత సమయంలో పండు ఈగ ఆశించే అవకాశం ఉంది. మామిడి కాయలు వృద్ధి చెంది పండుగా మారే దశలో పక్వానికి వచ్చే దశలో పండు ఈగకు చెందిన ఆడ ఈగలు కాయలపై గుడ్లు పెడుతాయి. గుడ్డు నుంచి 2 రోజుల్లో వెలువడిన పిల్ల పురుగులు తెల్లగా బియ్యం గింజల ఆకారంలో కాయలోనికి ప్రవేశించి గుజ్జు తింటూ వృద్ధి చెందుతాయి. ఫలితంగా గుజ్జు మెత్తబడి కాయలు పండుబారి పురుగు చేసిన రంధ్రాల నుంచి రసం కారుతుంది. దీని కారణంగా కాయలు రాలిపోతాయి. ఒక్కో ఆడ ఈగ సుమారు 250 నుంచి 300 గుడ్లుపెడుతాయి. ఈ వర్షాకాలంలో పండు ఈగల వృద్ధి మరింత ఎక్కువగా ఉంటుంది. ఈ పండు ఈగ నివారణకు బెంగళూరుకు చెందిన భారత ఉద్యాన పరిశోధన సంస్థ ఈ పండు ఈగ ఆకర్షణ బుట్టలు రూపొందించింది. వీటితో పండు ఈగలను నివారించవచ్చని జిల్లా ఉద్యాన శాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు.

వజ్రాలపురం గంగమ్మ జాతర ప్రారంభం



వజ్రాలపురంలో కలశపూజ చేస్తున్న అర్చకులు

బంగారుపాళెం: మండలంలోని వజ్రాలపురంలో వెలసిన శక్తి స్వరూపిణి బోయకొండ గంగమ్మ 26వ జాతర మహోత్సవం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలను నిర్వహించారు. కలశ స్థాపన, ధ్వజారోహణ, గణపతి హోమం, చండీయాగ కార్యక్రమాలను చేపట్టారు. అమ్మ వారికి పూజలు చేశారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మ వారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాలకు ఆలయ ధర్మకర్తలు రాధమ్మ, కృష్ణప్ప, దీప, గోపి, చాతుర్య, పురుషోత్తం ఉభయదారులుగా వ్యవహరించారు. మంగళవారం అమ్మవారికి అంబళ్లు, పొంగళ్లను సమర్పించనున్నారు. అనంతరం అమ్మ నిజరూప దర్శనం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజర్ మొగిలప్ప, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎంపీటీసీ రాజీనామా

తవణంపల్లె: స్థానిక ఎంపీటీసీ సభ్యుడు కిసాన్ బాబు తన పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సోమవారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. వైస్ ఎంపీపీ పదవి కేటాయింపులో అన్యాయం జరగడంతో తాను మనస్తాపం చెంది రాజీనామా చేసినట్లు వివరించారు. ఈ మేరకు ఆయన ఎంపీడీఓకు లేఖను అందించినట్లు తెలిపారు.

సుందరయ్యకు నివాళి



నివాళి అర్పిస్తున్న నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: స్వాతంత్య్ర సమరయోధుడు ఆదర్శనేత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా సోమవారం సీపీఎం జిల్లా కార్యాలయంలో నివాళులర్పించారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గంగరాజు మాట్లాడారు. దేశ సమగ్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషిచేసిన గొప్ప మేధావి పుచ్చలపల్లి సుందరయ్య అని కొనియాడారు. తెలంగాణ సాయుధ పోరాటానికి సారథ్యం వహించి రజాకారులకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప నేత అన్నారు. నాయకులు బాలసుబ్రమణ్యం, దాము, చిట్టెమ్మ, షకీలా పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థికసాయం

గ్రామీణ విద్యార్థులకు చేయూతనివ్వడమే లక్ష్యంగా ఏర్పాటైన అమృత భారతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆర్థికసాయం అందజేశారు. చిత్తూరు కార్యాలయంలో సోమ వారం ఫౌండేషన్ సభ్యులు ప్రకాశ్ రెడ్డి పేద పిల్లలు సందీప్, గ్రీష్మ తండ్రి మోహన కృష్ణకు రూ.25 వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మురళి, లోకేష్, హేమంత్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి



ప్రజలతో కలిసి కార్పొరేషన్ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న నౌషాద్

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని 27, 28వ డివిజన్ల పరిధిలో ఉన్న షావుకార్‌పేటలో తాగునీటి సమస్య పరిష్కరించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నగర ఉపాధ్యక్షులు నౌషాద్ కోరారు. ఈ మేరకు కాలనీ వాసులతో కలిసి సోమవారం చిత్తూరు మునిసిపల్ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందచేశారు. అనంతరం నౌషాద్ మాట్లాడుతూ రెండు డివిజన్లలో నాలుగు నీటి బోర్లు ఉన్నాయని, వీటిలో నీటి నిల్వలు గణనీయంగా పడిపోయాయని చెప్పారు. దీనివల్ల బోరు నుంచి పది రోజులకు ఓసారి మాత్రమే నీళ్లు సరఫరా అవుతున్నాయని పేర్కొన్నారు. అధికారులు అద్దెనీటి ట్యాంకర్లు పంపుతున్నప్పటికీ, ప్రజలందరికీ నీళ్లు చాలడంలేదని గుర్తుచేశారు. దీనిపై ఇన్‌చార్జ్ కమిషనర్ వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ నేరుగా ఆ ప్రాంతాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

వేసవి శిక్షణతో విజ్ఞానం పెంచుకోవాలి



శిక్షణ ఇస్తున్న రిసోర్స్ పర్సన్ రాజశేఖర్

ఐరాల: గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతుల సాయంలో విద్యార్థులు విజ్ఞానాన్ని పెంచుకోవాలని స్థానిక గ్రంథాలయాధికారి సుజాత అన్నారు. గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం విద్యార్థులకు కథలు చదివించడం, పాటలు, డ్రాయింగ్, పుస్తక పఠనం, వ్యాసరచన తదితర అంశాల్లో శిక్షణ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ ఈ అంశాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు ఇస్తామని తెలిపారు. విద్యార్థులకు సెలవులు ఇచ్చిన దృష్ట్యా సమయం వృథా కాకుండా ఉండేందుకు స్థానిక గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. దీంతో మేధాశక్తి పెంపొందించుకోవడమే కాకుండా సమయం వృథా కాకుండా పుస్తకపఠనం చేసినట్లవుతుందని తెలిపారు. గ్రంథాలయాలకు వచ్చి పుస్తకాలు చదువుకొని ఉన్నత స్థాయి అధిరోహించిన వారు చాలామంది ఉన్నారన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ రాజశేఖర్ పాల్గొన్నారు.

మహాసభ గోడపత్రిక విడుదల



గోడపత్రికలను విడుదల చేస్తున్న నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: ఏపీసీటీ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర 3వ మహాసభ గోడపత్రికలను నాయకులు విడుదల చేశారు. జిల్లా వాణిజ్య పన్నులశాఖ కార్యాలయం వద్ద సోమవారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సంఘం జిల్లా అధ్యక్షుడు పూర్ణం మాట్లాడుతూ, జూన్ 5న విజయవాడలో జరిగే కార్యక్రమంలో ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు గిరిధర్, సురేష్, కృష్ణమూర్తి, జగదీష్, సునీల్ పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

చిత్తూరు అర్బన్: నగర శివారు ప్రాంతాల్లోని కాలనీల్లో మౌలిక వసతులు, సదుపాయాలు కల్పించాలని ప్రజలు అధికారులను కోరారు. చిత్తూరు నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించారు. ఇన్‌చార్జ్ కమిషనర్ వెంకటరామిరెడ్డి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. రోడ్లు, కాలువలు, నీటి సమస్యలపై ప్రజలు అర్జీలు అందజేశారు. వీటిని క్షేత్రస్థాయిలో విచారించి, పరిష్కరించేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఇంజనీరింగ్, టౌన్‌ప్లానింగ్, ప్రజారోగ్యం, రెవెన్యూ, విభాగాలకు సంబంధించి ఫిర్యాదులు అందాయి. ఈ గ్రీవెన్స్‌లో ఏసీపీ నాగేంద్ర, డీఈఈ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం తీసుకుంటున్న కార్పొరేషన్ అధికారులు

బాలిక అదృశ్యంపై కేసు

గుడిపాల: బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. ఆయన కథనం మేరకు, పీలేరులోని పద్మావతి నగర్‌లో నివాసం ఉంటున్న రంగస్థల కళాకారుడు. మండలంలోని వసంతాపురం గ్రామం వద్ద జరుగుతున్న మహాభారత యజ్ఞంలో వీధి నాటకాలు ప్రదర్శిస్తున్నారు. అయితే వీరి కుమార్తె (16) అక్కడే ఉండేది. ఆ బాలిక శనివారం వీరి వద్ద నుంచి అదృశ్యమైంది. అప్పటినుంచి ఎక్కడ వెదికినా ఆచూకీ లభించకపోవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

అలరించిన అర్జున తపస్సు



అర్జున తపస్మాన్‌పై అర్జునవేషధారి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): మహాభారతం యజ్ఞంలో భాగంగా చిత్తూరు నగర పరిధిలోని 11వ డివిజన్ బండపల్లిలో సోమవారం అర్జున తపస్సు ఉత్సవం అలరించింది. నాటక మండలి కళాకారులు అర్జున తప్పస్సు ఘటాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ కళాకారుడు పద్యాలు ఆలపించి, తపస్మాన్ గొప్పతనాన్ని వివరించారు. అనంతరం తపస్మాన్‌పై నుంచి చల్లిన నిమ్మకాయలు, ప్రసాదం కోసం గ్రామస్తులు ఎగబడ్డారు. దీన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామస్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.